
సాక్షి ఒడిశా

బుధవారం । 4 । సెప్టెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,74,775
బంగారం	420 మిల్లీ గ్రాములు
వెండి	25 గ్రాముల 450 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



పరిశీలనలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు

రాష్ట్రంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రభుత్వ పరిశీలనలో ఉందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ప్రకటించారు.

-12లో



పాముకాటుతో బాలుడు మృతి

మల్కన్‌గిరి జిల్లాలోని కలిమెల సమితి ఎంపీవీ 15 గ్రామంలో పాముకాటుతో బాలుడు మృతి చెందాడు.

-12లో

న్యూస్‌రీల్

గనుల డిప్యూటీ డైరెక్టర్ అరెస్ట్



ధరణీదర్ నాయక్

భువనేశ్వర్: అక్రమాస్తుల ఆరోపణ కింద తాల్చేర్ గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ధరిణిదర్ నాయక్‌ని విజిలెన్స్ అధికారులు అరెస్ట్ చేశారు. సోమవారం నుంచి చేపట్టిన సోదాల్లో విలాసవంతమైన భవనాలు, నగదు వంటి అక్రమ ఆర్జిత ఆస్తులను గుర్తించారు. ఆయనకు రూ.133 లక్షల విలువైన ఫ్లాట్లు, 2 మార్కెట్ సముదాయాలు, 11 ఇండ్ల స్థలాలతో బ్యాంకు పొదుపు ఖాతాల్లో రూ.53 లక్షలు, భువనేశ్వర్‌లో డూప్లెక్స్ భవనం ఉన్నట్లు గుర్తించారు.

పట్టుబడిన ఎలుగు



బోనులో ఉన్న ఎలుగుబంటి

కొరాపుట్: గత 20 రోజులుగా మొక్కజొన్న తోటలో మకాం వేసిన ఎలుగుబంటి ఎట్టకేలకు పట్టుబడింది. మంగళవారం వేకువజామున నబరంగపూర్ జిల్లా పపడాహండి సమితిలో అటవీ శాఖ అధికారులు ఎలుగుబంటిని బంధించారు. అక్కడ మొక్కజొన్న తోటలో ఎలుగుబంటి శాశ్వతంగా ఉండిపోవడంతో ప్రజలు వ్యవసాయ పనులకు కూడా వెళ్లడానికి భయపడేవారు. చివరికి అధికారులు పట్టుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

బాలాసోర్‌లో వరకట్న హత్య..?



లక్ష్మీప్రియ(ఫైల్)

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా ఖొయిరా పోలీసుస్టేషన్ పరిధిలోని తెంతొల గ్రామంలో సోమవారం రాత్రి అనుమానాస్పదంగా నవ వధువు మృతి చెందింది. ఇటీవల పెళ్లి చేసుకున్న మహిళ శవం ఇంట్లోని ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. అయితే వరకట్నం కోసం భర్త, అత్తమామలే ఆమెని హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కేవలం ఫ్రిజ్ కోసమే ఆమెను వేధించేవారని పేర్కొన్నారు. సారాపూర్ గ్రామానికి చెందిన సుదామ సెఠి కుమార్తె లక్ష్మీప్రియ సెఠికి తెంతొల గ్రామానికి చెందిన జగన్నాథ్ దాస్‌తో ఈ ఏడాది జూన్ 14న వివాహం జరిగింది. అయితే జగన్నాథ్ మరియు అతని తల్లి ఫ్రిజ్ తీసుకురావాలని లక్ష్మీప్రియను వేధించేవారని తెలుస్తోంది. భర్త జగన్నాథ్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.

అంబులెన్స్, పోలీసు వ్యాన్ ఢీ

భువనేశ్వర్: మయూర్‌భంజ్ జిల్లా ఉదోల ప్రాంతం పెట్రోల్ పంప్ స్క్వేర్ సమీపంలో 108 అంబులెన్స్, పోలీసు వ్యాను సోమవారం అర్ధరాత్రి ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో హోంగార్డు లక్ష్మీధర్ మహంత పోలీసు వ్యాను కింద నలిగి అక్కడికక్కడే మరణించాడు. అలాగే ఉదోలా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి (ఐఐసీ), అంబులెన్సు ఫార్మాసిస్టు, హెల్పర్, డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వీరందరినీ స్థానిక ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఐఐసీ, డ్రైవర్ పరిస్థితి విషమించడంతో బరిపద ఆస్పత్రికి తరలించారు. ఘటనపై విచారణ జరుగుతోంది.

పట్టుబడిన బాక్సైట్ తరలిస్తున్న వ్యాన్



స్వాధీనం చేసుకున్న పికప్ వ్యాన్

రాయగడ: ఆగి ఉన్న గూడ్స్ ట్రైన్‌లో బాక్సైట్ బస్తాలను దొంగిలించి తరలిస్తున్న పికప్ వ్యాన్‌ను మునిగుడ ఆర్‌పీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల రాకను గమనించిన వ్యాన్ డ్రైవర్ అక్కడ నుంచి పరారయ్యాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. లంజిఘడ్‌లోని వేదాంత కంపెనీ నుంచి గూడ్స్ ట్రైన్‌లో బాక్సైట్ పౌడర్ విశాఖపట్నం తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో మునిగుడ రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్ కొంత సమయంలో నిలపాల్సి వచ్చింది. ఇదే అదనునుగా భావించిన కొందరు గుర్తు తెలియని దుండగులు గూడ్స్ ట్రైన్‌లోని బాక్సైట్ బస్తాలను అక్రమంగా దొంగిలించి పికప్ వ్యాన్‌లో నింపి, తరలించేందుకు సన్నాహాలు చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు సంఘటన స్థలంకు చేరుకోగా, వీరిని గుర్తించిన దుండగులు పికప్ వ్యాన్‌ను అక్కడే విడిచి పరారయ్యారు.

భయపెడుతున్న బర్డ్ ఫ్లూ

- పూరీ జిల్లాలో వ్యాధి వ్యాప్తి
- ఇప్పటికే 35,000 కోళ్లు పూడ్చివేత
- నేడు రాష్ట్రానికి రానున్న కేంద్ర బృందం



భువనేశ్వర్: రాష్ట్ర ప్రజలను బర్డ్ ఫ్లూ భయపెడుతోంది. ఈ భయంలో ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో దాదాపు 35,000 పైబడి కోళ్లను పాతిపెట్టారు. దీంతో వ్యాధి వ్యాప్తి నియంత్రణ, అరికట్టే చర్యలపై కేంద్ర, రాష్ట్ర అధికారులు వర్చువల్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో ఈ పరిస్థితిని సమీక్షించేందుకు కేంద్రం నుంచి ప్రత్యేక బృందం రెండు రోజుల పర్యటనకు రానుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, భారత ప్రభుత్వ పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ కార్యదర్శి అలకా ఉపాధ్యాయ, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ సంబంధిత శాఖల సీనియర్ అధికారులు, భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్, పూరీ, కేంద్రాపడా, ఖుర్దా కలెక్టర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు.

నాలుగు హాట్‌స్పాట్‌లు

పూరీ జిల్లా పిప్పిలి, సత్యబాది, నిమ్మాపడా, డెలాంగ్ మండలాలను బర్డ్‌ఫ్లూ హాట్‌స్పాట్‌లుగా నిర్ధారించారు. కేంద్ర ప్రభుత్వ కార్యాచరణ ప్రణాళిక మార్గదర్శకాల మేరకు ఈ ప్రాంతాల్లో నివారణ, వ్యాప్తి కట్టడి కార్యకలాపాలు చేపట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు వివరించారు. పిప్పిలి, సత్యబాదిలో ఈ కార్యాచరణ పూర్తి కాగా, డెలాంగ్, నిమ్మాపడాలో ఈ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ పనుల్లో సమగ్రంగా 51 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు (ఆర్‌ఆర్‌టీ) పాల్గొంటున్నాయి. వ్యాధి సోకిన ప్రాంతాల్లో కోళ్లను చంపి పూడ్చిన తర్వాత అనుబంధ పారిశుద్ధ్య కార్యకలాపాలు చేపడుతున్నారు. ఇప్పటివరకు 35,329 కోళ్లు చంపి, 84 గుడ్లు, 15,380 కిలోల కోళ్ల దాణా పూడ్చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత పోషకులకు సమగ్రంగా రూ.10,94,572 పరిహారంగా అందజేశారు.



వర్చువల్ సమావేశంలో పాల్గొన్న సీఎస్ మనోజ్ ఆహుజా తదితరులు

కేంద్ర బృందం పర్యటన

రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి తాజా పరిస్థితులను పర్యవేక్షించేందుకు కేంద్ర బృందం విచ్చేయనుంది. ప్రభావిత ప్రాంతాల్లో ఈ బృందం వరుసగా 2 రోజులపాటు పర్యటిస్తుంది. బుధవారం నుంచి పర్యటన ప్రారంభమవుతుంది.

అవగాహన కీలకం

బర్డ్ ఫ్లూ వ్యాప్తి కట్టడిపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలి. సమీప ప్రాంతాల్లో క్లినికల్ నిఘాను తీవ్రతరం చేసి ప్రభావిత ప్రాంతాల నుంచి కోళ్లు, దాణా ఇతరేతర అనుబంధ ఉత్పత్తుల ప్రవేశాన్ని నిరోధించాలని ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా ఆదేశించారు. అలాగే బర్డ్ ఫ్లూ నిర్ధారణ పరీక్షల ప్రక్రియ క్రమబద్ధీకరిస్తారు. సీరమ్ సేకరణ మరియు సాధారణ నమూనాల పరీక్ష కోసం అధీకృత ప్రయోగశాలలకు పంపిస్తారు. కోళ్లని పూడ్చిన ప్రాంతాల పరిసరాల్లో వైపరీత్యం తలెత్తకుండా పారిశుద్ధ్య కార్యాచరణ పటిష్టపరచాలని ఆదేశించారు. ఈ మేరకు అన్ని రకాల సహాయాన్ని అందజేస్తామని భారత ప్రభుత్వ పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ కార్యదర్శి హామీ ఇచ్చారు.

సంబల్‌పూర్‌లో రెండో ఎయిమ్స్



అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న దృశ్యం

- రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ముఖేష్ మహాలింగ్

భువనేశ్వర్: సంబల్‌పూర్‌లో రెండో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)ని ప్రారంభించాలని యోచిస్తున్నట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ముఖేష్ మహాలింగ్ శాసన సభలో మంగళవారం తెలిపారు. ఈ మేరకు త్వరలో కేంద్ర ప్రభుత్వంతో సంప్రదిస్తామన్నారు. అందరికీ నాణ్యమైన వైద్యం అందించాలనేది ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు. అలాగే సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత వైద్యుల భద్రతను నిర్ధారించడానికి ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి అధ్యక్షతన ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. వైద్యుల భద్రతపై ఈ టాస్క్‌ఫోర్స్ దృష్టి సారిస్తుందని వెల్లడించారు. పనిచేస్తున్న వైద్యులందరి భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతీ వైద్య కళాశాలలో పోలీస్ అవుట్ పోస్ట్ తెరవడానికి ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయని వెల్లడించారు.

ఉచిత డయాలసిస్ సేవలు

అందుబాటు ధరలో వైద్యం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా 55 ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత డయాలసిస్ సేవలు తీసుకొస్తున్నట్లు మంత్రి తెలిపారు. అత్యవసర వైద్య సేవలను వేగంగా పొందే ప్రయత్నంలో అంబులెన్స్ రవాణా సమయం 30 నిమిషాల నుంచి 20 నిమిషాలకు తగ్గించబడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీర్ సురేంద్ర సాయి దివ్య దృష్టి కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ప్రజలకు సమగ్ర ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను కల్పించడమే దీని లక్ష్యమని పేర్కొన్నారు. బాలాసోర్, మయూర్‌భంజ్, కొరాపుట్, పూరీ, జాజ్‌పూర్‌లలో కొత్త నర్సింగ్ కాలేజీలతో పాటు వైద్య నిపుణుల కొరతను తీర్చడానికి కొత్త వైద్య కళాశాలలు రానున్నాయని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ యోజన పథకం కింద 27,000 ఆస్పత్రులు ఎంపానెల్ చేయనున్నారు. అన్ని గ్రామ పంచాయతీ ప్రధాన కార్యాలయాల్లో ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ఏర్పాటు చేస్తుందని చెప్పారు. వైద్య నిపుణుల కొరతను తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం 300 మంది వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని నియమించాలని యోచిస్తోందని వెల్లడించారు. ఒడియాలో వైద్య మరియు ఇంజినీరింగ్ కోర్సులను అందించడంలో ఒడిశా హెల్త్ యూనివర్సిటీ పూర్తిస్థాయిలో పని చేస్తుందన్నారు.

రైలు మార్గాన్ని అనుసంధానించాలి

- కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలాకా



తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజరుతో సప్తగిరి శంకర్ ఉలాకా

భువనేశ్వర్: కొరాపుట్ నియోజకవర్గానికి రైలు మార్గాన్ని అనుసంధానించాలని ఎంపీ సప్తగిరి శంకర్ ఉలాకా కోరారు. ఈ మేరకు స్థానిక చంద్రశేఖర్‌పూర్‌లోని తూర్పు కోస్తా రైల్వే జోనల్ కార్యాలయంలో జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్, ఇతర అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. జయపురం – మల్కన్‌గిరి, నవరంగపూర్ రైలు మార్గం పనులు వేగవంతం చేయాలన్నారు. గుణుపురం – తేరుబలి రైల్వే, రాయగడ డివిజన్ ఏర్పాటు ప్రాజెక్టులపై త్రైమాసిక సమీక్ష సమావేశాలకు రైల్వే ఉన్నతాధికారులు హాజరు కావాలన్నారు. పద్మపూర్‌ని గుణుపురం – తేరుబలి రైల్వేలైన్ ప్రాజెక్టులో చేర్చాలని కోరారు. అలాగే గోపాల్‌పూర్ – పద్మపూర్ – గుమడ (ఆంధ్రప్రదేశ్) రైల్వేలైన్ ప్రాజెక్ట్‌ను వేగవంతం చేయాన్నారు. నౌపడ – గుణుపురం, కొరాపుట్–రాయగడ మార్గంలో రైళ్ల వేగాన్ని పెంచడం అనివార్యమని పేర్కొన్నారు. కోవిడ్ నేపథ్యంలో నిలిపివేసిన రైలు స్టాపేజీలు పునరుద్ధరించాలన్నారు. సీనియర్ సిటిజన్లు, జర్నలిస్టులకు రైల్వే రాయితీలు అమలు చేయాలని విన్నవించారు.

రెచ్చిపోయిన అల్లరిమూకలు

- ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలు



గాయపడిన ప్రశాంత్ మాఝి

రాయగడ: స్థానిక అటానమస్ కళాశాలలో గుర్తు తెలియని కొందరు అల్లరిమూకలు విద్యార్థులపై దాడులకు తెగబడ్డారు. ఈ దాడుల్లో ముగ్గురు విద్యార్థులకు తీవ్రగాయాలవ్వడంతో కళాశాల సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ప్రిన్సిపాల్ బాబిలత షరప్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

మెయిన్ గేటు తొలగించి

మంగళవారం మధ్యాహ్నం కొంతమంది వ్యక్తులు కళాశాల మెయిన్ గేట్‌ను తొలగించి లోపలికి ప్రవేశించారు. అనంతరం కళాశాలలో చదువుతున్న కొంతమంది విద్యార్థులపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. వీరి దాడులకు భయపడిన కొంత మంది విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లి దాక్కున్నారు. అనంతరం అల్లరి మూకలు తరగతి గదుల్లోని చైర్లు, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. వీరి దాడుల్లో ప్లస్ 3 మొదటి సంవత్సరం చదువుతున్న ప్రశాంత్ మాఝి, ప్లస్ 2 రెండో సంవత్సరం చదువుతున్న సుంచి అఖిల్ అనే విద్యార్థులకు తీవ్రగాయాలు తగిలాయి. తలపై బలమైన గాయాలు తగలడంతో సమాచారం తెలుసుకున్న కళాశాల సిబ్బంది అంబులెన్స్ సాయంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. అయితే గత మూడు సంవత్సరాలుగా ఇటువంటి తరహా అల్లర్లు తరచూ కళాశాలలో చోటుచేసుకుంటున్నాయని ప్రిన్సిపాల్ బబిలత షరప్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా కళాశాల లోపలకి ప్రవేశించి విద్యార్థులపై దాడులకు దిగడం అమానుషమన్నారు. బయట తగాదాలు పడి ఇలా కళాశాలల్లో కొట్లాటలు, దాడులు చేసుకోవడం విచారకరమని పేర్కొన్నారు.

విద్యార్థినులకు అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందిన విద్యార్థులు



డాక్టర్లతో మాట్లాడుతున్న అధికారులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి కుంద్ర సమితి అసన పంచాయతీ ఉదల్‌గుడ గ్రామంలోని కేడీఏఫ్(కొరాపుట్ డవలప్‌మెంట్ ఫౌండేషన్) ఆశ్రమ పాఠశాల హాస్టల్‌లో సోమవారం రాత్రి విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. భోజనం చేసిన విద్యార్థినుల్లో 69 మంది అస్వస్థతకు లోనయ్యారు. వెంటనే ఆశ్రమ అధికారులు వారిని కుంద్ర కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. వారిని పరీక్షించిన డాక్టర్లు విషాహారం తినడం వలనే వాంతులకు గురైనట్లు హాస్పిటల్ అధికారి డాక్టర్ గణేష్ ప్రసాద్ దాస్ మంగళవారం వెల్లడించారు. ఆ హాస్టల్‌లో మొత్తం 240 మంది విద్యార్థినులు ఉంటున్నారు. విద్యార్థినులకు ఎప్పటిలాగానే భోజనం పెట్టామని, అయితే వారు అస్వస్థతకు గురవ్వడానికి కారణం తెలియడం లేదని హాస్టల్ నిర్వాహకుడు సంతోష్ కుమార్ సాహు పేర్కొన్నారు. విద్యార్థినులు భోజనం చేసిన తర్వాత వారికి ఐరన్ మాత్రలు ఇచ్చామని, అనంతరం ఒక రెండు గంటలు తర్వాత వాంతులు చేసుకున్నారని హాస్టర్ కేర్ టేకర్ పేర్కొన్నారు. సమాచారం అందిన వెంటనే కుంద్ర బీడీవో కపిలేశ్వర తండి, కుంద్ర తహసీల్దార్ బినోద్ చంద్ర నాయిక్ ఆస్పత్రికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం అధికారులు హాస్టల్‌కు వెళ్లి అక్కడి పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు.

ఎంపీ బలభద్ర సమీక్ష సమావేశం



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితిలో నవరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మాఝీ సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ముందుగా ఆయన కలిమెల, పోడియా సమితుల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఉద్యోగులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. యువత వలసలు వెళ్లకుండా ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పథకాలు గిరిజనులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో కలిమెల సమితి అధికారి ప్రదీప్ కోర తదితరులు పాల్గొన్నారు.

7 నెలల గర్భిణి ఆత్మహత్య



బినితా (ఫైల్)

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి ఎంపీవీ 9 గ్రామంలో నివాసముంటున్న బినిత మాలి (35) అనే మహిళ సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటి వద్దే పెట్రోలు పోసుకొని నిప్పు అంటించుకుంది. దీంతో అత్తింటివారు గమనించి వెంటనే మల్కన్‌గిరి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె 90 శాతం కాలిపోయింది. కాగా ఆమె చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో మృతి చెందింది. ఆమె భర్త జగదీష్ మాలి తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం ఉదయం సమయంలో 7 నెలల గర్భిణీ అయినటువంటి బినిత మాలి ఆస్పత్రికి రెగ్యులర్ చెకప్‌కు వెళ్లి వచ్చింది. ఇప్పటికే వారికి ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. దీంతో మూడో సంతానం విషయంపై కొద్ది రోజులుగా ఆమె మానసికంగా ఇబ్బంది పడుతోందని తెలిపారు. అయితే ఎందుకు ఆత్మహత్య చేసుకుందో తెలియడం లేదని పేర్కొన్నారు. అయితే ఆమెను అత్తింటివారే హత్య చేశారని మృతురాలి అన్న ఆరోపిస్తూ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండో తెలిపారు. ఆమె కడుపులో బిడ్డ కూడ మృతి చెందడంతో ఆపరేషన్ చేసి బయటకు తీశారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

‘వే’దన



దివ్యాంగురాలైన రోగిని మంచం మీద కూర్చోబెట్టి ఆస్పత్రికి తరలించిన ఘటన నవరంగపూర్ జిల్లాలోని జొరిగాం సమితి సేల్మగూడ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గత కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన లక్ష్మీ గౌదోను ఆస్పత్రికి తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులు అనుకున్నారు. అయితే గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో ఆటోలు కూడా వచ్చే పరిస్థితి లేదు. దీంతో మంచంపైనే ఆమెను సుమారు రెండు కిలోమీటర్లు వరకు మోసుకొని తీసుకెళ్లారు.

- కొరాపుట్

దరఖాస్తుల నమోదు



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పోరిదా సుభద్ర పోర్టల్ సోమవారం ప్రారంభించిన విషయం తెలిసిందే. దీంతో గజపతి జిల్లాలోని అన్ని సీడీపీవో, అంగన్‌వాడీ, జనసేవా, సీఎస్‌సీ కేంద్రాల్లో దరఖాస్తుల నమోదు జరుగుతోంది. దీంతో నమోదు చేసుకోవడానికి మహిళలు ఎగబడ్డారు. జిల్లా కేంద్రం పర్లాకిమిడిలో హెడ్ పోస్టాఫీసు, బెబర్తావీధి, ఆరోగ్యవీధి, రాజవీధిల్లో సీఎస్‌సీ కేంద్రాలు కిక్కిరిసిపోయాయి. ఈనెల 17వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు.

- పర్లాకిమిడి

సభ్యత్వ నమోదు



రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి బీజేపీ సభ్యత్వ కార్యక్రమాన్ని మంగళవారం ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ప్రారంభించారు. రాష్ట్ర ప్రజలకు బీజేపీ అధికారం, పరిపాలనపై విశ్వాసం బలపడిందని ఆయన అన్నారు. మెగా మెంబర్‌షిప్ డ్రైవ్‌లో కోటి మంది సభ్యులను చేర్పించాలని పార్టీ రాష్ట్ర యూనిట్ ప్రతిష్టాత్మకంగా లక్ష్యంగా పెట్టుకుంది. పార్టీ సభ్యత్వం పొందడానికి ఆసక్తి ఉన్న 18 ఏళ్లు పైబడిన వ్యక్తులు టోల్ ఫ్రీ నంబర్ 88000 02024కు మిస్డ్ కాల్‌తో సభ్యత్వం పొందేందుకు వీలవుతుంది.

- భువనేశ్వర్

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య కేసులో అత్తమామలు అరెస్టు



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ శ్రీనివాస రావు

నరసన్నపేట: స్థానిక శ్రీనివాస అపార్ట్‌మెంటు నాలుగో ఫ్లోర్‌లో ఆత్మహత్యకు పాల్పడిన బరాటం అనూరాధ కేసులో ఆమె అత్తమామలను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అత్త బరాటం విజయలక్ష్మి, బరాటం చిరంజీవిలను అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు విచారణ చేస్తున్న అదనపు ఎస్పీ శ్రీనివాస రావు తెలిపారు. ఇప్పటికే ఈ కేసులో అనూరాధ భర్త శ్రావణ్‌ను అరెస్టు చేశామన్నారు. వరకట్న వేధింపుల కేసు నమోదు చేయగా.. ఆమె ఆత్మహత్యకు అత్తమామల వేధింపులు కూడా ఉన్నట్లు ఆధారాలు లభించాయని తెలిపారు. ఈ మేరకు వీరిని కోర్టులో హాజరు పరిచామని అదనపు ఎస్పీ తెలిపారు. అదనపు ఎస్పీతో పాటు నరసన్నపేట సీఐ జె. శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ ఉన్నారు.

జ్వరంతో మైత్రీ పోలీసు మృతి



తెలుకల గణేష్

ఆమదాలవలస: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో మైత్రి విధానంలో విధులు నిర్వహిస్తున్న తెలుకల గణేష్ (32) అనే యువకుడు జ్వరంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు.. మందస ప్రాంతానికి చెందిన గణేష్ స్థానిక బంగారం షాపుల వద్ద రాత్రి వేళలో గస్తీ కాయటానికి మైత్రి విధానంలో విధులు నిర్వహిస్తున్నాడు. జ్వరంతో బాధపడుతున్న గణేష్ పట్టణంలో ఓ ప్రైవేటు వైద్యుడి వద్ద చికిత్స పొందుతూ చనిపోయాడు.

తన కుమారుడికి మోతాదుకి మించి ఔషధం అందించడం వల్లనే మృతి చెందాడని మృతుడి తల్లి తెలుకుల ద్రౌపది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి రిమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మందస ప్రాంతానికి చెందిన యువకుడిని ఎస్ఐ డ్రైవర్‌గా తీసుకువచ్చి మైత్రీ విధానంలో విధుల్లో ఉంచినట్లు స్థానికులు చెబుతున్నారు. ఎస్ఐ మాత్రం బంగారం దుకాణాల వద్ద రాత్రి వేళలో గస్తీ నిర్వహిస్తున్నాడని చెబుతున్నారు.

శివాలయంలో విగ్రహాలు చోరీ



హిరమండలం దుర్భలాపురంలో చోరీ జరిగిన ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ యాసిన్

హిరమండలం: దుర్భలాపురం గ్రామంలోని బాలకామేశ్వర స్వామి ఆలయంలో చోరీ జరిగింది. సోమ వారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు ఆలయం తాళాలు పగలుగొట్టి ఆలయలంలో ఉన్న గణపతి, శివుడు, పార్వతి, నంది, శ్రీవల్లిదే వసేనా సుబ్రహ్మణ్య స్వామి, దుర్గాదేవి, శివలింగం, సత్యనారాయణ స్వామి పంచలోహ, ఇత్తడి విగ్రహాలను దొంగిలించారు. తెల్లవారుజామున గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ ఎండీ యాసిన్ పోలీస్ సిబ్బంది మంగళవారం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి పరిశీలించారు. అర్చకులు, గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇదే ఆలయలంలో మూడు నెలల క్రితం దుండగులు చొరబడి సీసీ కెమెరాలు దొంగిలించినట్లు స్థానికులు తెలిపారు. చోరీకి గురైన దేవతా విగ్రహాలు సుమారు 40కిలోలు ఉంటాయని పేర్కొన్నారు.

అంతర్జాతీయ ఈత పోటీలకు జమ్ము విద్యార్థి



ప్రవీణ్‌ను సత్కరించి స్విమ్మింగ్ డ్రస్ వితరణ చేస్తున్న చిట్టిబాబు

నరసన్నపేట: అంతర్జాతీయ స్థాయిలో ఈజిప్టులో అక్టోబర్ 10 నుంచి 13 వ తేదీ వరకూ జరగనున్న ఈత పోటీల్లో జమ్ముకు చెందిన టెంక ప్రేమకుమార్ అండర్-17 బాలుర విభాగంలో పాల్గొననున్నాడు. ఈ మేరకు ప్రవీణ్‌కు ఏపీ ఈత ఫెడరేషన్ అసోసియేషన్ నుంచి సమాచారం వచ్చింది. ప్రస్తుతం యానాం సాయి అకాడమీలో ఈత పోటీలపై ప్రవీణ్ శిక్షణ పొందుతున్నారు. పాస్‌పోర్టు పనిపై జమ్ము వచ్చిన ఈయనకు స్థానిక వైఎంసీఏ ప్రతినిధి గొద్దు చిట్టిబాబు, క్రికెట్ సబ్‌సెంటర్ కోచ్ కుప్పిలి శ్రీనులు అభినందించారు. పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన స్విమ్మింగ్ డ్రస్, షూస్ చిట్టిబాబు వితరణ చేశారు. ఈ పోటీల్లో ప్రవీణ మంచి ప్రతిభ చూపాలని ఆయన ఆకాంక్షించారు.

పరిశీలనలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు



అసెంబ్లీలో మాట్లాడుతున్న సీఎం మోహన్ చరణ్ మాఝీ

- సీఎం మోహన్ చరణ్ మాఝీ
- సోమవారమే బెంచ్ ఏర్పాటుకు అవకాశం లేదని ప్రకటన

భువనేశ్వర్: రాష్ట్రంలో హైకోర్టు బెంచ్ ఎక్కడా ఏర్పాటు చేయడానికి అవకాశం లేదని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ సోమవారం ప్రకటించిన విషయం తెలిసిందే. విపక్ష బిజూ జనతా దళ్ సభ్యుడు కలికేష్ నారాయణ సింగ్ దేవ్ ప్రశ్నకు ముఖ్యమంత్రి అసెంబ్లీలో ఇలా సమాధానం చెప్పారు. అయితే దీనిపై విపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో పరిస్థితి చేయి దాటక ముందే ముఖ్యమంత్రి పరిస్థితి చక్కదిద్దుకున్నారు. మంగళవారం సభా కార్యక్రమాల్లో రాష్ట్రంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రభుత్వ పరిశీలనలో ఉందని తనంతట తానుగా ప్రకటించారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ప్రజలకు సత్వర న్యాయం అందించడానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ముందు రోజున సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు పరిమితమై స్పందించినట్లు సవరించారు. వాస్తవ స్థితిగతుల పరిశీలన తర్వాత తాజా ప్రకటన చేసినట్లు వివరించారు. రాష్ట్రంలో ప్రధానంగా పశ్చిమ ఒడిశాలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం తారా స్థాయిలో ఉద్యమాలు, ఆందోళనలు, న్యాయవాదుల నిరవధిక విధుల బహిష్కరణ వంటి దుమారం రేగింది. కొత్త ప్రభుత్వం పగ్గాలు చేపట్టడంతో ఈ పరిస్థితులపై తాజా పోకడని సభలో నిలదీయడంతో ముఖ్యమంత్రి అకస్మాతుగా హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసే యోచన లేదనడంతో ఉద్యమ సంకేతాలు తళుక్కుమన్నాయి.

సీఎం ప్రకటనపై అసంతృప్తి

కాగా సీఎం తాజా ప్రకటనపై సైతం బొలంగీర్ బీజేడీ ఎమ్మెల్యే కలికేష్ నారాయణ్ సింగ్ దేవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్ణీత గడువులోగా హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ హామీని కోరినట్లు గుర్తు చేశారు. మంగళవారం చేసిన ప్రకటనలో గడువు విషయం మినహాయించి మొక్కుబడిగా బదులు ప్రవేశపెట్టడం ఆమోద యోగ్యం కాదని వ్యాఖ్యానించారు. ఇప్పుడైనా ఈ విషయాన్ని స్పష్టం చేయాలని కోరారు. సంబల్‌పూర్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే జయ నారాయణ్ మిశ్రా కూడా ముఖ్యమంత్రి తొలి ప్రకటనపై అభ్యంతరం వ్యక్తం చేయడం గమనార్హం. ముఖ్యమంత్రి సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావించారు. అయితే రాష్ట్రంలో జనాభా పెరుగుతోంది మరియు హైకోర్టులో కూడా కేసులు పెరుగుతాయి. ఉత్తర ప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా 3 హైకోర్టు బెంచ్‌లు ఉండగా, ఒడిశాకు ఎందుకు ఎందుకు ఉండకూడదని ఆయన నిలదీశారు. పశ్చిమ ఒడిశాలో హైకోర్టు బెంచ్ కోసం బలమైన ఒత్తిడి తలెత్తడంతో బీజేపీ ప్రభుత్వం విమర్శలను ఎదుర్కొంది. పరిస్థితి మరింత విషయమించకుండా ముఖ్యమంత్రి జాగ్రత్త వహించినట్లు స్పష్టమవుతోంది. అనంతరం న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ మాట్లాడుతూ ప్రభుత్వం పూర్తిస్థాయి సంప్రదింపుల అనంతరం తగిన నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

గవర్నర్‌తో డీజీపీ భేటీ



రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ వై.బి.ఖురానియా స్థానిక రాజ్ భవన్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్‌ని రాజ్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

– భువనేశ్వర్

శ్రీమందిరంలో సత్తొపురీ భోగం



ఆలం చండీమాత ఆలయం నుంచి సంప్రదాయ రీతిలో మట్టి పాత్రల తరలింపు



స్వామివారికి నివేదించిన పూరీ

భువనేశ్వర్: భాద్రపద అమావాస్య తిథిని సప్తపూరీ అమావాస్యగా వ్యవహరిస్తారు. ఈ తిథి నాడు శ్రీమందిరం రత్న వేదికపై కొలువుదీరిన దేవతా త్రయానికి 3 పెద్ద మట్టి పాత్రల్లో పెద్ద పరిమాణంలో ఉన్న 7 పూరీలు (సప్త పూరీ) భోగం నివేదిస్తారు. ఉదయం పూట ధూప సేవ అనంతరం ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. దీనికోసం అవసరమైన మట్టి పాత్రలను ముందు రోజు భాద్రపద మాసం కృష్ణ పక్ష చతుర్దశి నాడు సిద్ధం చేస్తారు. స్థానిక 18 నొలా ప్రాంతంలో ఆలం చండీ మాత దేవస్థానం శ్రీమందిరానికి తరలిస్తుంది. కుమ్మరి సేవకులు ఈ పాత్రలను ప్రత్యేక పరిమాణంతో తయారు చేస్తారు. ఈ పాత్రలను అమ్మవారి సన్నిధిలో పూజించి మధ్యాహ్న ధూప సేవ తర్వాత మేళతాళాలు, బాజాబజంత్రీల మధ్య ఊరేగింపుగా సోమవారం తరలించారు. శ్రీ మందిరం ప్రాకార ప్రదక్షిణ చేసిన తర్వాత మూల విరాటులకు నివేదించేందుకు ఈ పాత్రలను ప్రతిహారి నియోగులకు అప్పగించారు. అమావాస్య నాడు శ్రీమందిరం పోటులో తయారు చేసిన భారీ పరిమాణపు పూరీలను 7 వంతున మట్టి పాత్రాల్లో పేర్చి రత్న వేదిక ప్రాంగణానికి తరలించారు. ఈ సందర్భంగా షోడశోపచార పూజాదులు నిర్వహించారు.

పాముకాటుతో బాలుడు మృతి



బిడ్డ మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంపీవీ 15 గ్రామంలో నివాసముంటున్న ఆశిస్ మండాల్ కుమారుడు రోహన్ మండాల్ (10) సోమవారం రాత్రి ఇంట్లో తండ్రి పక్కన పడుకున్నాడు. మంగళవారం ఉదయం తండ్రి మొదట లేచి బయటకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి ఇంకా కొడుకు లేవకపోవడంతో లేపాడు. అయితే బాలుడు లేవకపోగా శరీరం మొత్తం నీలి రంగులో మారింది. దీంతో వెంటనే కలిమెల ఆరోగ్య కేంద్రానికి తీసుకొని వెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి బాలుడు పాముకాటుకు గురై మృతి చెందినట్లు పేర్కొన్నారు. దీంతో తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు. పోస్టుమార్టం అనంతరం వైద్యులు మృతదేహాన్ని అప్పగించారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలని వినతి



ఎంపీ అప్పలనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

రణస్థలం: సోంపేట మండలం బీల భూముల్లో పర్యావరణానికి హానికరమైన థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఆందోళన చేసిన ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బీన ఢిల్లీ రావు, ఏపీ బీసీ న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర జర్నలిస్టుల సమాఖ్య అధ్యక్షుడు చౌదరి లక్ష్మణరావు ప్రభుత్వాన్ని కోరారు. రణస్థలం మండల కేంద్రంలోని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకి ఆయన క్యాంప్ కార్యాలయం వద్ద మంగళవారం వినతిపత్రం అందజేశారు. 2010 జూలై 14న నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పి కాల్పులు జరిపించి ముగ్గురు వ్యక్తులను బలిగొందన్నారు. మొత్తం 723 మందిపై వివిధ సెక్షన్ల కింద తప్పుడు కేసులు పెట్టారని తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ అప్పట్లో ప్రస్తుత సీఎం చంద్రబాబుతో కలిసి బీల ప్రాంతాన్ని సందర్శించామని గుర్తుచేశారు. ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తివేసేలా సీఎం దృష్టికి తీసుకుని వెళ్తానన్నారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆలీ బేగ్, మహిళా అధ్యక్షురాలు బద్రి సీతమ్మ తదితరులు ఉన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

రణస్థలం: రావాడ పంచాయతీలో గల ఉప్పివలస గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన నోడగల సూరి అనే యువకుడు ప్రేమ పేరుతో లోబర్చుకుని గర్భవతి చేయడంపై జీఆర్ పురం పోలీసులు కేసు నమోదు చేశారు. జీఆర్ పురం పోలీసులు, బాధిత బాలిక కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం ఈ నెల 2వ తేదీన బాలిక ఇంట్లో కళ్లు తిరిగి పడిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు రణస్థలం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి చికిత్స అందించారు. ఈ నేపథ్యంలో వైద్యులు టెస్టులు చేయగా బాలిక ఏడో నెల గర్భంతో ఉందని తెలిసింది. వెంటనే అక్కడి నుంచి శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించి వైద్యం అందించారు. మంగళవారం ఉదయం బాలిక ఇద్దరు మగ బిడ్డలకు జన్మనిచ్చింది. ఇద్దరు పిల్లలు ప్రస్తుతం ఎస్ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు నోడగల సూరిపై జీఆర్ పురం ఎస్ఐ ఎస్. చిరంజీవి పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కార్మిక శాఖ వద్దకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు గత ఎనిమిది నెలలుగా వేతనం అందజేయ లేదు. వేతనం సమస్యను కార్మి క శాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళతామని చెప్పేందుకు వర్సిటీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం అనుమతులు కోరారు. అయితే ఇద్దరు ఉన్నత అధికారులు కా ర్యాలయంలో పీఏలకు వినతి పత్రం ఇచ్చి వెళ్లి పోవాలని ఆఫీస్ సబార్డినేట్ ద్వారా తెలియజేశారు. కార్మిక శాఖ నిబంధనల మేరకు పనిచేసిన 100 రోజుల్లోగా వేతనం ఇవ్వాల్సి ఉండగా నిబంధన అమలు జరగలేదు. మరో పక్క 34 ఉద్యోగాల నియామకాలకు సంబంధించిన కాంట్రాక్టు సంస్థ ఒప్పందం మేరకు గుంటూరుకు చెందిన తాడేపల్లి ఏజీఎస్ మేనేజ్‌మెంట్ సంస్థ ప్రతి నెల ఐదు లోపు వేతనాలు జమచేస్తామని ఒప్పంద పత్రంలో పేర్కొంది. ఈ మేరకు కార్మిక శాఖకు ఫిర్యాదు చేసి కోర్టును ఆశ్రయిస్తామని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తెలిపారు. ప్రస్తుతం సొంత ఖర్చులతో ఉద్యోగులు రోజూ వర్సిటీకి హాజరై వారికి అప్పగించిన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం



గాయపడిన మహిళ నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

టెక్కలి రూరల్: మండలంలోని పోలవరం గ్రామానికి చెందిన బగాది మహాలక్ష్మి అనే వివాహిత మంగళవారం తన ఒంటిపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మహాలక్ష్మి తన భర్త రాజారత్నం(బుజ్జి)తో మంగళవారం వేకువజామున వచ్చిన చిన్నపాటి తగాదా కారణంగా మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న డీజిల్ ఒంటిపై పోసుకుని నిప్పు అంటించుకుందని స్థానికులు తెలిపారు. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు తీవ్రగాయాలకు గురైన ఆమెను హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి 50 శాతానికి పైగా కాలిపోవడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చెయ్యనున్నట్లు తెలిపారు గాయపడిన మహాలక్ష్మి(సుహాసిని) ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆయాగా పనిచేస్తుంది.

జాబ్‌మేళాలో 63 మంది ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: యువతీ యువకులు తమకు నచ్చిన రంగంలో అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు పేర్కొన్నారు. ఆ కళాశాల సెమినార్ హాల్‌లో మంగళవారం కళాశాల జేకేసీ నోడల్ రిసోర్స్ సెంటర్, ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా జరిగింది. ఈ మెగా జాబ్ మేళాలో 10 ప్రైవేటు సంస్థలు పాల్గొన్నాయి. జిల్లా నలుమూలల నుంచి 187 మంది హాజరుకాగా.. వివిధ మౌఖిక పరీక్షల అనంతరం 63 మంది జాబ్ మేళాలో ఎంపికయ్యారు. మహిళా డిగ్రీ కళాశాల నుంచి జాబ్‌మేళాలో 65 మంది పాల్గొనగా 32 మంది ఎంపికయ్యారు.

వీరికి ఆయా కంపెనీ ప్రతినిధులు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీబీ సాయిశ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకర్‌నారాయణ, జేకేసీ కోఆర్డినేటర్ ఐ.శ్రీలక్ష్మి, డాక్టర్ వాణీకుమారి, అధ్యాపకులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

30 ఎకరాలు ఆక్రమణ

భువనేశ్వర్: రాజధానిలోని విలువైన భూములు అక్రమార్కుల కబ్జాలో ఉన్నాయని గృహ నిర్మాణం, నగరాభివృద్ధి శాఖ మంత్రి కృష్ణచంద్ర మహాపాత్రో ప్రశ్నోత్తరాల్లో ప్రకటించారు. సామపూర్ మౌజాలో అత్యధికంగా 27 ఎకరాల విస్తీర్ణం భూమి కబ్జాకు గురైందన్నారు. గడాకొణలో 2 ఎకరాలు, చంద్రశేఖర్‌పూర్‌లో ఒకటిన్నర ఎకరాల స్థలం ఆక్రమణలో ఉందని వెల్లడగించారు. హైకోర్టులో 16 జప్తు కేసులు విచారణ పెండింగ్‌లో ఉన్నాయి.

283 మంది బాల కార్మికులకు ఉపశమనం

భువనేశ్వర్: రాష్ట్రంలో గత 5 ఏళ్లలో 283 మంది బాల కార్మికులను రక్షించారు. సభలో కాంగ్రెస్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి ప్రశ్నకు కార్మిక శాఖ మంత్రి సమాధానంలో ఈ విషయం తెలిపారు. కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కార్మిక అధికారికి, పోలీసులకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అలాగే అర్హత కలిగిన 1.26 లక్షల మంది గ్రామీణ ప్రజలు ప్రధాన్‌మంత్రి ఆవాస్ యోజన – గ్రామీణ (పీఎంఏవై-జీ) కింద ఇంటి కోసం ఎదురు చూస్తున్నారని అసెంబ్లీలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రబీ నారాయణ్ నాయక్ లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.

ఇన్‌స్టాగామ్‌లో నకిలీ ఖాతా

భువనేశ్వర్: తన పేరుతో ఎవరో ఇన్‌స్టాగామ్‌లో నకిలీ ఖాతా సృష్టించినట్లు కారాగార శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ (జైళ్లు)గా పనిచేస్తున్న ఒడిశా కేడర్ ఐపీఎస్ అధికారి అమితాబ్ ఠాకూర్ మంగళవారం తెలియజేశారు. ఈ ఖాతాతో తనకు ఎటువంటి ప్రమేయం లేనందున స్పందించవద్దని హెచ్చరించారు.

అడవి జంతువుల దాడుల్లో 68 మంది మృతి

భువనేశ్వర్: ఈ ఏడాది రాష్ట్రంలో పలు చోట్ల ఏనుగులు, ఇతర వన్యప్రాణుల దాడుల్లో ఇప్పటివరకు 68 మంది మృతి చెందినట్లు అటవీశాఖ మంత్రి గణేష్ రామ్ సింగ్ ఖుంటియా తెలిపారు. బీజేడీ ఎమ్మెల్యే అరుణ్ కుమార్ సాహూ అడిగిన ప్రశ్నకు ఈవిధంగా సమాధానమిచ్చారు. ఈ సంవత్సరంలో రాష్ట్రంలోని వివిధ అటవీ మండలాల్లో మానవ, వన్యప్రాణుల సంఘర్షణ ఘటనల్లో మానవుల మరణంతో పాటు 1,087 ఇళ్లు, 2,315.79 ఎకరాల్లో పంటలు దెబ్బ తిన్నాయన్నారు. ప్రాణుల దాడులను నివారించడానికి ఢెంకనాల్ మండలంలో హిందోల్, చందక అటవీ డివిజన్‌లోని భరత్‌పూర్, అంగుల్ మండలాల్లో ఏఐతో ఈ – పర్యవేక్షణ ప్రాజెక్టను ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

జయపూర్‌కు విమాన సౌకర్యం

భువనేశ్వర్: రాష్ట్ర రాజధాని భువనేశ్వర్, జయపురం మధ్య ప్రత్యక్ష విమానయాన సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. బుధవారం నుంచి సేవలు ప్రారంభం కానున్నాయి. ఇండియా వన్ సంస్థ విమానాలను నడపనుంది. రెండు విమానాలు వారానికి 3 రోజులు (సోమ, బుధ మరియు శుక్ర వారం) మరియు మిగిలిన రోజుల్లో ఒకే విమానం నడుస్తుంది. ఈ రెండు ప్రాంతాల మధ్య ప్రయాణ నిడివి 1 గంట 35 నిమిషాలు ఉంటుంది.

గుణుపూర్‌లో కలెక్టర్ పర్యటన



ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ కిరణ్ దీప్

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో కలెక్టర్ ఫరూల్ పట్వారి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్‌తో సమావేశమై వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం గుణుపూర్ సమితి పరిధి పుటాసింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులతో కాసేపు గడిపారు. హాస్టల్‌లోని వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల ఆరోగ్యం విషయంలో నిర్వాహకులు శ్రద్ధ వహించాలని, ఆహార నాణ్యతను పాటించాలని ఆదేశించారు. అలాగే గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రిలో పర్యటించి రోగులకు అందుతున్న సౌకర్యాలు గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

అధికారుల దాడులు



స్వీట్ షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

పర్లాకిమిడి: పాలిథిన్ సంచుల వినియోగాన్ని నివారించేందుకు పర్లాకిమిడిలోని పలు స్వీట్స్ షాపులు, హోటల్స్, కాయగూరల దుకాణాల్లో పురపాలక, పౌర సరఫరాల శాఖ సిబ్బంది, ఆహార భద్రత ఇన్‌స్పెక్టర్ తపస్వినీ బెహరా తదితరులు దాడులు నిర్వహించారు. వరుసగా సోమవారం, మంగళవారం తనిఖీలు చేపట్టారు. దీనిలో భాగంగా పలు షాపులకు సుమారు రూ.31 వేల జరిమానా విధించారు. హోటల్స్‌లో గృహ వినియోగ గ్యాస్ సిలెండర్లు వినియోగిస్తున్నందుకు జరిమానాలు విధించి, ఐదు సిలెండర్లు స్వాధీనం చేసుకున్నారు. రానున్న రోజుల్లో తనిఖీలు ముమ్మరం చేస్తామని అదనపు సివిల్ సప్లయ్ అధికారి బిష్ణుచరణ్ పరిడా తెలిపారు.

వ్యాపారి నివాస భవనం జప్తు



గణేష్ బెహర ఆస్తులను జప్తు చేస్తున్న అధికారులు

జయపురం: బ్యాంక్ నుంచి తీసుకున్న రూ.4.25 కోట్ల రుణం తిరిగి చెల్లించకపోవడంతో జయపురం సమితి అంబాగుడలో లక్ష్మీ ట్రాక్టర్ గ్యారేజ్ యజమాని గణేష్ ప్రసాద్ బెహర ఆస్తులను యూనియన్ బ్యాంక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది మంగళవారం జప్తు చేశారు. బ్యాంకులో తీసుకున్న రుణాన్ని తీర్చమని ఎన్ని విజ్ఞప్తులు చేసినా స్పందించకపోవడంతో చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.

త్వరలో పెసా చట్టం అమలు

భువనేశ్వర్: గిరిజనుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం త్వరలో షెడ్యూల్ట్ ప్రాంతాలకు పంచాయతీ విస్తరణ (పెసా) చట్టం-1996ను రాష్ట్రంలో అమలు చేయనుంది. పొట్టంగి ఎమ్మెల్యే, కాంగ్రెస్ శాసన సభ నాయకుడు (సీఎల్‌పీ) రామచంద్ర కదం సభలో మంగళ వారం అడిగిన ప్రశ్నకు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రబీ నారాయణ్ నాయక్ సమాధానమిస్తూ ఈ విషయాన్ని తెలిపారు.

అమొ ఒడిశా పనులు పునః ప్రారంభం

భువనేశ్వర్: క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత అమొ ఒడిశా, నవీన్ ఒడిశా కార్యక్రమం కింద పనులు పునః ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. కాంగ్రెస్ సభ్యుడు తారా ప్రసాద్ బాహినీపతి, బీజేపీ శాసన సభ్యుడు సిద్దాంత్ మహాపాత్రో అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రబీ నారాయణ్ నాయక్ ఈ విషయాన్ని తెలిపారు. అమొ ఒడిశా, నవీన్ ఒడిశా చొరవ కోసం బడ్జెట్‌లో రూ.3,457 కోట్ల రూపాయలు కేటాయించారు. కొన్ని పనులు నత్తనడకన సాగుతుండగా 30 నుంచి 40 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయని మంత్రి వివరించారు.

రిజర్వేషన్ కౌంటర్ తరలింపు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్

పర్లాకిమిడి: స్థానిక ట్రెజరీ రోడ్డులో పాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో గత కొన్నేళ్లుగా ఉన్నటువంటి ఈస్టుకోస్టు రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైల్వేస్టేషన్‌కు ఈనెల 15లోగా తరలించనున్నట్లు రైల్వే సీనియర్ సూపరింటెండెంట్ ఎల్.రమణమూర్తి తెలియజేశారు. అప్పటి బరంపురం ఎంపీ దివంగత గోపీనాథ గజపతి హయాంలో ఈ రైల్వే రిజర్వేషన్ కౌంటర్ తాత్కాలికంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేశారు. ఇక్కడ 20 ఏళ్లకు పైగా ప్రయాణికులకు సేవలు అందజేసింది.

22 కిలోల గంజాయి పట్టివేత



అరెస్టైన వ్యక్తి, పట్టుబడిన గంజాయితో పోలీసులు

పర్లాకిమిడి: గుసాని బ్లాక్ గారబంద పీఎస్ పరిధి పెద్దహంస గ్రామ సమీపంలో ఎస్ఐ లోకనాథ బెహరా ఆధ్వర్యంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఒక స్కూటీలో 22 కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయి విలువ మార్కెట్‌లో రూ.60 వేలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి స్కూటీతో సహా నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. పట్టుబడిన గంజాయి నువాగడ బ్లాక్ సుందర్‌గడ్ నుంచి పలాసకు రవాణా అవుతున్నట్లు విచారణలో తేలింది.

క్లుప్తంగా

చిరుద్యోగుల తొలగింపు దురదృష్టకరం

• మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: నియోజకవర్గంలో పలువురు చిరుద్యోగుల తొలగింపు, మరికొందరు మండల, పంచాయతీ స్థాయి ఉద్యోగస్తులను బదిలీపై వెళ్లిపోవాలని కొంతమంది టీడీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడు తున్న పరిస్థితులు తమ దృష్టికి వస్తున్నాయని మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన సాలూరులో స్థానిక విలేకరులతో మాట్లాడారు. పలువురు మండలస్థాయి రెగ్యులర్ అధికారులు, సచివాలయ ఉద్యోగులను బదిలీపై వెళ్లిపోవాలని టీడీపీ నాయకులు బెదిరిస్తుండడం మంచి సంప్రదాయం కాదని అభిప్రాయపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎప్పుడూ అలా జరగలేదని, నేటి కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న పరిణామాలను ఉద్యోగస్తులు గమనించాలని కోరారు.

పోలీసు మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

• ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్‌శాఖలో పనిచేసి మృతిచెందిన వారి కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆయన ఇటీవల జిల్లా పోలీసుశాఖలో హోంగార్డ్‌గా పనిచేస్తూ మృతిచెందిన ఎస్.చిన్నోడు కుటుంబానికి చేయూతగా హోంగార్డులు పోగుచేసిన ఒక రోజు అలవెన్స్ రూ. 3 లక్షల 25వేల 890 చెక్‌ను ఆయన సతీమణి ఎం.రజనికి అందజేశారు. అదేవిధంగా కానిస్టేబుల్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన పి.గౌరీ కుమార్ కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన అడిషనల్ కార్పస్ ఫండ్ రూ.లక్ష చెక్‌ను సతీమణి టి.ఇందిరావసంతికి అందజేశారు. హోంగార్డు చిన్నోడు సతీమణి రజనికి ఇప్పటికే హోంగార్డుగా ఉద్యోగం కల్పించామని తెలిపారు. కానిస్టేబుల్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీ లు సకాలంలో వచ్చే విధంగా చర్యలు చేపట్టడంతో పాటు, వారి కుటుంబం లో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు ప్రతిపాదనలు పంపుతామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఆఫీస్ సూపరింటెండెంట్ ఏఎస్పీ.ప్రభాకరరావు, ఆర్ఐ ఆర్.రమేష్ కుమార్, పోలీసు కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసవం చేసిన 108 ఈఎంటీ



బిడ్డను చూపుతున్న ఈఎంటీ శ్రీనివాసరావు

రాజాం సిటీ: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణికి 108 ఈఎంటీ ప్రసవం చేశారు. రాజాం మండల పరిధి కొత్తారిపురం గ్రామానికి చెందిన అడపా తులసమ్మకు ఈ నెల 2న అర్ధరాత్రి సమయంలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. ఈ విషయాన్ని కుటుంబసభ్యులు గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త దేవికి తెలియజే యగా ఆమె 108కు సమాచారం అందించడంతో హుటాహుటిన గ్రామానికి చేరుకుని గర్భిణి పరిస్థితిని గమనించిన ఈఎంటీ ఎ.శ్రీనివాసరావు, పైలెట్ బి.రవిలు డెలివరీ చేశారు. ఆడ శిశువుకు జన్మనివ్వడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

1800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లంఊట, సారాను ధ్వంసం చేస్తున్న పోలీస్ సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి పరిసర ప్రాంతాల్లో చినమేరంగి పోలీసులు, ఎస్పీ పోలీసులు మంగళవారం దాడి చేసి 1800 లీటర్ల బెల్లం ఊటను, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. చినమేరంగి ఇన్‌చార్జ్ ఎస్సై అనీస్, ఏఎస్సై కాసులుతో పాటు పోలీస్ సిబ్బంది ఈ దాడుల్లో ఉన్నారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి



గురుబిల్లి గంగమ్మ (ఫైల్)

పాలకొండ రూరల్: మండలంలోని ఎల్.ఎల్.పురం గ్రామానికి చెందిన గురుబిల్లి గంగమ్మ (71) పాముకాటుతో మరణించింది. సోమవారం రాత్రి పొలం నుంచి ఇంటికి ఆమె వస్తున్న క్రమంలో పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను బంధువులు పాలకొండ ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది.

ఒకరు కాదు ఇద్దరు..!

ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో మరో ఎన్నికల సమరానికి రంగం సిద్ధమవుతోంది. లక్షలాది ఎకరాలకు సాగునీరందిస్తున్న తోటపల్లి ప్రాజెక్ట్ పాత, కొత్త కాలువల పరిధిలోని ప్రాజెక్టులకు నూతనంగా ఇద్దరు చైర్మన్లను ఎన్నుకునేందుకు ఓటర్ల(రైతులు) జాబితాపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి గెజిట్ నోటిఫికేషన్ వచ్చిన వెంటనే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రాజెక్ట్ పరిధిలోని ఇంజినీరింగ్ అధికారులు తెలియజేస్తున్నారు. ప్రాజెక్ట్ చైర్మన్ పదవి ప్రతిష్టాత్మకమైనది కావడంతో కూటమి పార్టీలకు చెందిన ఆశావహులు అప్పుడే పావులు కదపడం మొదలు పెట్టారు.



తోటపల్లి ప్రాజెక్టు

• తోటపల్లికి చైర్మన్ల ఎంపికపై నిర్ణయం
• మొదలవుతున్న నీటి సంఘాల ఎన్నికల సందడి
• పావులు కదుపుతున్న కూటమి సభ్యులు

వీరఘట్టం: సాగునీటి ప్రాజెక్టుల ద్వారా పంట పొలాలకు పుష్కలంగా నీరందించి సాగును సస్యశ్యామలం చేసేందుకు జలయజ్ఞ ప్రదాత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2005లో ప్రతిపాదించారు. అందుకు అనుగుణంగా ప్రతి సాగునీటి ప్రాజెక్టుకు ఒక రైతును చైర్మన్‌గా చేసి నూతన ఒరవడికి అప్పట్లో శ్రీకారం చుట్టారు. ఒకప్పటి ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని 64 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందిస్తున్న తోటపల్లి జలాశయానికి కూడా ఒక చైర్మన్‌ను నియమించారు. అప్పటి నుంచి తోటపల్లి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి ప్రత్యేక హోదాను తీసుకువచ్చింది. దీంతో తోటపల్లి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి కోసం నాయకల మధ్య తీవ్ర పోటీ ఏర్పడింది. తోటపల్లి ప్రాజెక్టు చైర్మన్‌ను ఎన్నుకునేందుకు కూటమి ప్రభుత్వం ఇటీవల జలవనరులశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో ఒకప్పుడు 64 వేల ఎకరాల ఆయకట్టు ఉండేది. కొత్తగా నిర్మించిన కుడికాలువ ద్వారా 1.35 లక్షల ఎకరాలకు నీరందిస్తుండడంతో తోటపల్లి జలాశయం ఆయకట్టు మొత్తం 1.99 లక్షల ఎకరాలకు పెరిగింది. దీంతో పాత ఆయకట్టుకు ఒకరిని, కొత్త ఆయకట్టుకు మరొకరిని చైర్మన్లుగా ఎన్నుకునే అవకాశం ఉందని జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని 64 వేల ఎకరాల పాత ఆయకట్టులో గరుగుబిల్లి, వంగర, జియ్యమ్మవలస, వీరఘట్టం, పాలకొండ మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో 42 వేల మంది రైతులకు సంబంధిచి 25 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి. ఈ 25 నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులను ఆ సంఘం పరిధిలో ఉన్న ఆయకట్టు రైతులు ఎన్నుకుంటారు.ఈ 25 మంది నీటి సంఘాల అధ్యక్షులు వారిలోని ఐదుగురిని డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులుగా ఎన్నుకుంటారు. తర్వాత ఆ ఐదుగురు డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు వారిలోనే ఒకరిని తోటపల్లి ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఎన్నుకుంటారు.

పాత ఆయకట్టులో అంతా సిద్ధం

ప్రస్తుతం కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు తోటపల్లి పాత ఆయకట్టు వివరాలను ఇప్పటికే జలవనరులశాఖ అధికారులు ఆయా కలెక్టర్లకు సమర్పించారు. కలెక్టర్ ఆదేశాలు వచ్చిన వెంటనే మండలంలోని నీటి వినియోగదారుల సంఘాల వారీగా రైతులు అధ్యక్షులను ఎన్నుకుంటారు. తర్వాత వారిలో ఒకరిని డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. తద్వారా తోటపల్లి ప్రాజెక్టు చైర్మన్లను చేతులెత్తే పద్ధతి ద్వారా ఎన్నుకుంటారు.

ఈ ఏడాది కష్టమే

ప్రభుత్వ అనుమతులు వస్తే నీటిపారుదలశాఖ, రెవెన్యూ, ఉద్యానవన, వ్యవసాయశాఖ సంయుక్తంగా భూసర్వే నంబర్ల ఆధారంగా ఆయకట్టు రైతులను గుర్తించాల్సి ఉంది.ఈ నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలి. మళ్లీ ప్రభుత్వం నుంచి గెజిట్ నోటిఫికేషన్ వస్తే అప్పుడు నీటి సంఘాల ఎన్నికలు చేపట్టగలుగుతాం. ప్రస్తుత పరిస్థితిల్లో ఇది సాధ్యమయ్యే పనికాదు.వచ్చే ఏడాది వరకు ఆగాల్సిందే.

– ఆర్.రామచంద్రరావు, జలవనరుల శాఖ ఈఈ పార్వతీపురం, రాజాం డివిజన్‌లు

గెజిట్ నోటిఫికేషన్ కోసం..

నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఇటీవల ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి.పాత ఆయకట్టుకు సంబంధించి 64 వేల ఎకరాల్లో సాగు జరుగుతోంది.ప్రస్తుతం 25 నీటి వినియోగదారుల సంఘాలు,5 డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి.ఈ వివరాలను ప్రభుత్వానికి నివేదించాం .ప్రభుత్వం నుంచి గెజిట్ నోటిఫికేషన్ వస్తే నీటి సంఘాల ఎన్నికలు జరిపించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– డి.రవికుమార్, డీఈ, పాలకొండ డివిజన్

ఇదీ కొత్త కుడికాలువ పరిస్థితి

కొత్త కుడికాలువ పరిధిలో పార్వతీపురం, రాజాం డివిజన్లు ఉన్నాయి. ఈ డివిజన్లలో సీతానగరం, బొబ్బిలి, బలిజిపేట, బాడంగి, తెర్లాం, చీపురుపల్లి, నెల్లిమర్ల, పూసపాటిరేగ, రణస్థలం, గుర్ల, రాజాం, వంగర, జి.సిగడాం, లావేరు, సంతకవిటి, రేగిడి, గరివిడి మండలాలు ఉన్నాయి.ఆయా మండలాలకు సంబంధించి 1.35 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్న కొత్త కుడికాలువ పరిధిలో 36 నీటి సంఘాలను,12 డిస్ట్రిబ్యూటరీలను జలవనరులశాఖ అధికారులు గుర్తించారు. సుమారు 1.50 లక్షల మంది రైతులు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం నుంచి గెజిట్ నోటిఫికేషన్ వచ్చిన వెంటనే రెవెన్యూ, వ్యవసాయశాఖ, జలనరులశాఖ, ఉద్యానవనశాఖ అధికారులు సంయుక్తంగా ఆయకట్టులో సర్వే చేసి భూముల సర్వే నంబర్ల ఆధారంగా ఓటర్ల రైతులు)ను గుర్తిస్తారు. అనంతరం ఈ జాబితాలను ప్రభుత్వానికి నివేదిస్తారు. ప్రభుత్వం అనుమతులు వచ్చిన తర్వాత నీటి సంఘాల ఎన్నికలకు శ్రీకారం చుడతారు. అయితే కొత్త కుడి కాలువలో ఆయకట్టు ఎక్కువగా ఉండడంతో ఇప్పట్లో ఆయకట్టు రైతులను గుర్తించలేమని, వచ్చే ఏడాది సాధ్యమవుతుందని, అందుచేత కొత్త ఆయకట్టుకు సంబంధించి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎంపికకు వచ్చే ఏడాదివరకు ఆగాల్సిందేనని అధికారులు చెబుతున్నట్లు తెలుస్తోంది.

పావులు కదుతున్న కూటమి నాయకులు

ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిలాల్లో తోటపల్లి ప్రాజెక్ట్ చైర్మన్ పదవికి తీవ్ర పోటీ ఏర్పడింది.కొత్త కుడి కాలువకు తొలిసారి నీటి సంఘాలు ఏర్పడనుండడంతో అందరూ ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. కొత్త ఆయకట్టు పరిధి మండలాల్లోని కూటమి నాయకులు తమదైన స్థాయిలో ఎమ్మెల్యేలు, మంత్రులను ప్రసన్నం చేసుకుంటున్నారు. అలాగే గ్రామస్థాయిలో కూడా నీటి సంఘాల అధ్యక్షులు అయ్యేందుకు తమ బలగాలను సిద్ధం చేస్తున్నారు.అవసరమైతే తాయిలాలు ఇచ్చేందుకు కూడా పోటీలో ఉన్న నాయకులు సిద్ధమవుతున్నారు. పాత ఆయకట్టుకు ఇప్పటికే రెండుసార్లు ఎన్నికలు జరిగాయి. అందుచేతో ఇక్కడ కూడా చైర్మన్ పదవికి తీవ్ర పోటీ ఉంది.దీంతో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని తోటపల్లి పాత, కొత్త ఆయకట్టు పరిధిలో ఉన్న నీటి సంఘాల్లో ఎన్నికల సందడి మొదలైంది.

చదవకపోయినా ఫీజు చెల్లించాలట!

• సర్టిఫికెట్ ఇవ్వడం లేదని విద్యార్థిని ఆవేదన



విలేకరుల ముందు ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితురాలు రమ్య దంపతులు

బొబ్బిలి: తాను కళాశాలలో చదవక పోయినా రూ.పదివేలు ఫీజు చెల్లించి పదోతరగతి సర్టిఫికెట్ తీసుకెళ్లాలని పట్టణంలోని ఓ కళాశాల యాజమాన్యం తనను చిత్రవధ చేస్తున్నట్లు ఓ విద్యార్థిని వాపోతోంది. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద విలేకరులతో మంగళవారం బాధిత విద్యార్థిని బలిజిపేట మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన పత్తిగుల్ల రమ్య మాట్లాడుతూ 2019లో పదోతరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణురాలయ్యానని తెలిపింది. ఆ సమయంలో పట్టణంలోని నాయుడు కాలనీలో ఉంటున్న కళాశాల యాజమాన్యం మంచిఫలితాలొచ్చిన పిలలకు ఉచిత విద్యనందిస్తామని తమ బృందాన్ని గ్రామాలకు పంపింది.అప్పట్లో ఆ కళాశాలకు చెందిన రమేష్ అనే వ్యక్తి తమ ఇంటికి వచ్చి ఉచిత విద్యను తమ కళాశాలలో అందిస్తామని ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని, వీలుచూసుకుని కళాశాలకు వచ్చి చేరాలని చెప్పి తన పదోతరగతి సర్టిఫికెట్‌ను తీసుకెళ్లాడని చెప్పింది. అనంతరం తనకు పెళ్లి కుదరడంతో వెంటనే కళాశాలకు వెళ్లలేకపోయానని కొద్ది నెలల తరువాత వెళ్లి తన సర్టిఫికెట్ ఇవ్వాలని కోరితే రూ.పదివేలు కట్టాలని డిమాండ్ చేస్తున్నారని వివరించింది. ఈ నేపథ్యంలో గ్రామసర్పంచ్, పెద్దలను పలుమార్లు తీసుకెళ్లి మాట్లాడించినా డబ్బు చెల్లిస్తేనే సర్టిఫికెట్ ఇస్తామని యాజమాన్యం చెబుతోందని వివరించింది. పేదరికంలో ఉన్న తాము అంత డబ్బుచెల్లించలేమని చెప్పినా వినలేదని, దీంతో ఇటీవల డీఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేయగా ఆయన మాట్లాడితే చూస్తామని రేపు రావాలని చెప్పగా మంగళవారం కళాశాలకు వెళ్లి అడిగితే సర్టిఫికెట్ లేదని, ఎవరికి ఇచ్చావో ఆ వ్యక్తినే అడుక్కో అని చెప్పి పంపేశారని కన్నీటి పర్యంతమైంది. అప్పట్లో తన దగ్గర సర్టిఫికెట్ తీసుకున్న రమేష్‌ను అడిగితే ఆ కళాలలోనే ఉందని, దానికి తానే సాక్ష్యమని చెబుతున్నాడు తప్ప తీసుకురావడంలేదని వాపోతోంది. దీనిపై యాజమాన్యాన్ని ప్రశ్నించగా 2019నాటినుంచి రమ్య కళాశాలలో జాయిన్ అయినట్లు రికార్డుల్లో లేదని, సర్టిఫికెట్ ఏమైందో? ఎవరిదగ్గరుందో తమకు తెలియదని వివరణ ఇచ్చారు. దీంతో రమ్య దంపతులు రోదిస్తూ విలేకరుల ముందు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధితురాలు కోరుతోంది.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులపై సమీక్ష



పోలవరం ఎడమ కాలువ నిర్మాణ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట: బాబు జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు (పోలవరం ఎడమ కాలువ) పనుల నిర్వహణపై ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తన స్వగృహంలో ప్రాజెక్టు అధికారులతో మంగళవారం సమీక్షించారు. కాలువ నిర్మాణం, అవసరమైన భూములు, ఏఏ గ్రామాల్లో ఎంతంత భూమి అవసరమన్న విషయాన్ని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.మురళీకృష్ణ ఆమెకు వివరించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందే కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, ఎస్.కోట మండలాల్లో ఏఏ గ్రామాల మీదుగా కాలువ వెళ్తుంది.. రైతులకు చెందిన ఎంత భూమి కాలువ నిర్మాణానికి అవసరమవుతుందన్న విషయాన్ని ఆయా గ్రామాల్లో రైతు అభిప్రాయ సేకరణ సభలను నిర్వహించి తెలియజేశామన్నారు. కొత్తవలస మండలంలోని దేవాడ, ఎస్.కోట, వేపాడ మండలాల్లోని కొన్ని గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించాల్సి ఉందని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ కాలువ నిర్మాణానికి తమ వంతు సహకారం పూర్తిగా అందిస్తామని, గ్రామాల్లో రైతులు కూడా కాలువ నిర్మాణానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్ పి.రమేష్, గజా నిర్మాణ కంపెనీ డీజీఎం కె.సతీష్, డీఈ బి.లక్ష్మీ సుధ, మాజీ ఎంపీపీ కొల్లి రమణమూర్తి, టీడీపీ మండలాధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంపులో ఎన్‌సీసీ క్యాడెట్స్



అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంపులో స్థానిక గాజులరేగ పరిధిలోగల సీతం కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న ముగ్గురు ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామ మూర్తి తెలిపారు. ఈ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు ఎం.అచ్యుతరావు, సీహెచ్‌వేణుగోపాల్, డి.సూతన్‌కుమార్‌లకు ఆర్మీ సిబ్బంది ఆర్మీ ఆయుధాలు, ట్యాంకర్లు మొదలైన వాటిని చూపించి వాటి ఉపయోగాలను తెలియజేశారని చెప్పారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్స్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, వివిధ విభాగాల అధిపతులు మంగళవారం అభినందించారు.

విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: పాఠశాలల్లో పోషకాలతో కూడిన, పిల్లలు ఇష్టపడే రుచికరమైన మెనూ అందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. డొక్కాసీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న మెనూపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీలు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన వర్కర్లు, విద్యార్థులు పాల్గొని ప్రస్తుతం అందిస్తున్న మెనూ, దానిలో తీసుకురావాల్సిన మార్పులపై చర్చించి పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీలు, విద్యార్థుల అభిప్రాయానికి అనుగుణంగా మెనూలో కొన్ని మార్పులు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్న బడి భోజన పథకంలో విద్యార్థులకు అందిస్తున్న మెనూలో జిల్లాస్థాయిలో స్థానిక ఆహారపు అలవాట్లకు, విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా మార్పులు చేసుకోవడానికి ప్రభుత్వం వీలు కల్పించిందని తెలిపారు. విద్యార్థులకు అందించే ఆహారంలో పోషక విలువలు కోల్పోకుండా వారు ఇష్టపడేలా రుచికరంగా తయారుచేయాలని తెలిపారు. ఆకుకూరలు ఆహారంలో తప్పనిసరిగా భాగం చేయాలని చెప్పారు.

పోషకాలు కోల్పోకుండా వంటలు

సంప్రదాయ భోజనం పట్ల విద్యార్థులు ఇష్టం పెంచుకునేలా ఆహారాన్ని రుచికరంగా తయారుచేయాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. పోషకాలు కోల్పోకుండా రుచికరంగా వంటలు చేయడంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అవగాహన, శిక్షణ అందించాలని చెప్పారు. ఆకుకూరలు, కాయగూరల కోసం ప్రతి పాఠశాలలో మనబడి-మనతోట సిద్ధం చేయాలని, ఇప్పటికే చాలా పాఠశాలలకు విత్తనాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్లలో తప్పనిసరిగా న్యూట్రిషన్ గార్డెన్ పెంచాలని కోరారు. జాతీయ పోషకాహార వారోత్సవాలు నిర్వహిస్తున్నామని గర్భిణులు, బాలికల్లో పోషకాలు, రక్తహీనత లోపం లేకుండా ఆహారం తీసుకునేలా అవగాహన, ప్రచారం నిర్వహించాలని ఐసీడీఎస్ అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి జి. పగడాలమ్మ, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీలు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరు గంటల తరువాత అనుమతించకూడదు

• కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ఇసుక ర్యాంపులలోకి సాయంత్రం ఆరు గంటల తరువాత ఎవరినీ అనుమతించకూడదని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన జిల్లా స్థాయి ఇసుక కమిటీ, ఇరిగేషన్ అధికారులతో భామిని మండలం కాట్రగడ్డ ఇసుక ర్యాంపులో నిర్వహిస్తున్న ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇసుక ర్యాంపులో ఉదయం 6 గంటలనుంచి సాయంత్రం 6 గంటలవరకు మాత్రమే ఇసుకను వెలికితీయడం, విక్రయాల కార్యకలాపాలను నిర్వహించాలన్నారు. స్టాక్ పాయింట్‌ల వద్ద సీసీ కెమెరాలను, బందోబస్తును ఏర్పాటుచేయాలని పోలీసులను ఆదేశించారు. తోటపల్లి, వంశధార, పెద్దగెడ్డ, వట్టిగెడ్డ తదితర ప్రాజెక్టుల విస్తరణ పనులను పూర్తిచేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. మాతుమూరు ప్రాంతం విశాఖపట్నానికి దగ్గరలో ఉందని, ఆప్రాంతాన్ని సందర్శించి అక్కడ టూరిజం, పారిశ్రామిక అభివృద్ధికి ఉన్న అవకాశాలపై నివేదిక తయారుచేయాలని జేసీ శోభికను ఆదేశించారు. కార్యక్రమంలో వంశధార ఈఈ రామచంద్రరావు, డీటీఓ ఎం.శశికుమార్ తదితరులున్నారు.

ప్రకృతి వ్యవసాయం విస్తరించాలి

ప్రకృతి వ్యవసాయం మరింత విస్తరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయ అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఎక్కువ చేయడం వల్ల రసాయన ఎరువుల వినియోగం తగ్గుదల కనిపించాలని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను సత్కరించడం, వారి అనుభవాలను తెలియజేయాలని సూచించారు. ఇ-కామర్స్ విధానం వల్ల వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధర లభిస్తుందని చెప్పారు. వీడీవీకేల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసి విశాఖపట్నం, బెంగళూరు వంటి ప్రాంతాల మార్కెట్‌లకు తరలించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, డీపీఎం పి.షణ్ముఖరాజు, జట్టు ఆశ్రమం నిర్వాహకురాలు పద్మ, తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి జిల్లాలో భారీ వర్షాలు

• వరద ప్రమాదాన్ని ముందే గుర్తించాలి

విజయనగరం అర్బన్: బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని, దీని ప్రభావంతో జిల్లాలో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేసినట్టు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. జిల్లా యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, నీటి పారుదల శాఖ ఇంజినీర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నదులు, రిజర్వాయర్లలో నీటి ప్రవాహ పరిస్థితిని తెలుసుకున్నారు. ముద్దువలస ప్రభావిత గ్రామాల వీఆర్వోలు రాత్రీపగలూ అప్రమత్తంగా ఉండాలని, ఇరిగేషన్ అధికారులను ప్రతి మూడు గంటలకోసారి సంప్రదించి రిజర్వాయర్ ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను తెలుసుకోవాలని సూచించారు. పునరావాస కేంద్రాలను ముందుగానే గుర్తించాలన్నారు. ఛతీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిస్తే నాగావళి నది నుంచి తోటపల్లికి నీటితాకిడి పెరిగే అవకాశం ఉందన్నారు. వంగర, రేగిడి ఆమదాలవలస, సంతకవిటి మండలాల్లోని 30 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఆంద్ర, తాటిపూడి రిజర్వాయర్లలో నీటి నిల్వలపై ఆరా తీశారు. తాగునీరు, పారిశుద్ధ్యం, ప్రజారోగ్యంపై దృష్టిపెట్టాలని ఎంపీడీఓలను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఎస్‌డి అనిత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బిత్రపాడులోనే ఏనుగులు



బిత్రపాడు పంటపొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు పంట పొలాల్లో మంగళవారం ఏనుగుల గుంపు సంచరిస్తోంది. వారం రోజుల నుంచి చుట్టుపక్కల గ్రామాల్లో సంచరించిన ఏనుగులు నిమ్మలపాడు చేరుకున్నాయి. దీంతో పొలాలకు వెళ్లేందుకు రైతులు భయపడు తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించే ఏర్పాట్లు చేయాలని అటవీశాఖాధికారులను కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తరలింపు



అంగన్‌వాడీ కేంద్రం తరలింపును వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

• కూటమి నాయకుల సొంత భవనాల్లోకి మార్పు

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురం టౌన్: కూటమి నాయకులు, తెలుగు తమ్ముళ్ల స్వార్థానికి అడ్డూఅదుపు లేకుండా పోతోంది. వారి అధికార దాహానికి ఎవరైనా బలి కావాల్సిందే. చిన్నారులు..గర్భిణులు.. బాలింతలన్న కనికరం కూడా చూపడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల అద్దె తమ ఖాతాల్లోకి మళ్లించాలనుకున్నారో? లేక ఇప్పటివరకు అద్దె పొందుతున్న లబ్ధిదారులపై కక్షగట్టారో గానీ..చాలా ఏళ్లుగా లక్షణంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఊరికి దూరంగా తరలించేస్తున్నారు. పార్వతీపురం మండలంలోని అప్పందొర వలసలో అప్పందొరవలస గ్రామంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు చాలా ఏళ్లుగా నడుస్తున్నాయి. అద్దె భవనాల్లో ఉన్న వాటిని..కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వేరే భవనాల్లోకి తరలించడం వివాదంగా మారుతోంది. ఎంఆర్‌నగరం 2, అప్పందొరవలస, ఎస్సీ కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఊరికి దూరంగా మార్పు చేస్తున్నారు. ఇప్పటికే రెండు కేంద్రాలను మార్చగా..అప్పందొరవలసలోని కేంద్రాన్నీ జనావాసాలకు దూరంగా తరలిస్తున్నారు. గ్రామం మధ్యలో ఉన్న ఈ ప్రీస్కూల్ ద్వారా 40 మందికి పైగా చిన్నారులతోపాటు..గర్భిణులు, బాలింతలు లబ్ధి పొందుతున్నారు. ప్రస్తుతం ఈ కేంద్రాన్ని ఊరికి దూరంగా ఉన్న టీడీపీ నాయకుడికి చెందిన రేకుల షెడ్డులోకి మార్చేందుకు ఐసీడీఎస్ అధికారులు సిద్ధమవుతున్నారు. అక్కడ కనీస సౌకర్యాలు లేవు. పక్కనే పశువులను కడుతున్నారు. అపరిశుభ్ర వాతావరణం వల్ల పిల్లలకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రం పక్కనే పాడుబడిన నుయ్యి కూడా ఉంది. దీనికితోడు ఇక్కడికి చేరుకోవాలంటే ప్రధాన రహదారిని దాటాలి. అలాంటి చోటుకు పిల్లలను ఎలా పంపిస్తామని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే మార్చిన రెండు సెంటర్లూ అసౌకర్యాల నడుమే ఉన్నాయి. కొత్తగా మార్చిన భవనాల్లో ఒకటి సర్పంచ్‌ది కాగా.. మరొకటి మాజీ సర్పంచ్‌దని గ్రామస్తులు చెబుతున్నారు. ఇవి కూడా పాత భవనాలు కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళన చెందుతున్నారు.

కలెక్టర్ స్పందించాలి..

అంగన్‌వాడీ కేంద్రాల తరలింపును నిరసిస్తూ..అప్పందొరవలస గ్రామానికి చెందిన పెద్దలు, లబ్ధిదారులు మంగళవారం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టర్ దృష్టి సారించి ఇటువంటి చర్యలను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రామారావు, వార్డు సభ్యులు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ శ్రీరాములు, ఆర్.త్రినాథనాయుడు తదితరులు పాల్గొన్నారు.